మారుమూల ప్రాంతాలకు మెరుగైన నెట్వర్క్ సేవలను అందించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఉచిత వైద్య శిబిరం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 98 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 05 ఏప్రిల్ 2026


# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

**రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి**

**ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు**

**6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన**

**అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మిగతా2లో...



# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

**● సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు ● కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**

**తిరువనంతపురం, 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న మిగతా2లో...



# గడవు ముగుస్తోంది...

**- ఇరాన్‌కు మరోమారు ట్రంప్ హెచ్చరిక**

**వాషింగ్టన్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, మిగతా2లో...

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

**రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం:తీవ్రంగా ఖండించిన హరీష్ రావు**



**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల మిగతా2లో...

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి

**● పట్నం ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నిక ● క్యాతన్‌పల్లి ఛైర్‌పర్సన్‌గా గొడిశెల సంధ్యారాణి ఎన్నిక ● రెండుచోట్లా ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్**



**హైదరాబాద్, 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది.

మిగతా2లో...

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**● బావిలోకి దూసుకెళ్లిన కారు ● ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి**



**ముంబై,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):**మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన

మిగతా2లో...

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

**- ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు**

**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.

మిగతా2లో...

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

**కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు**

**బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు**




# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

**● బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్**

**● అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జనార్ హెచ్చరిక**



**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. మిగతా2లో...

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు.

గత కొన్ని రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఎట్టకేలకు ఈ మున్సిపాలిటీని భారత్ రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు.. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి తరఫున సుదర్శన్ రెడ్డి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. గతంలో అనేక విధ్యాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా, 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్-సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ, మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. తాజాగా నిర్వహించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు మాత్రం ఎన్నికకు హాజరయ్యారు. ఇక కోరం ఉండటంతో ఎన్నిక ప్రక్రియను సజావుగా కొనసాగించారు. దీంతో గొడిశెల సంధ్యారాణి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ ఛైర్మన్‌గా గెలుపొందారు.

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు.

మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటమని వివరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించు కోవడానికి ఈ వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజున 'పెయిడ్ హాలిడే' ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటు వేయడానికి వెళ్లే ఉద్యోగుల జీతంలో ఎటువంటి కోత విధించకూడదని యాజమాన్యాలకు సూచనలు జారీ అయ్యాయి. అసోం, కేరళ మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఓటర్ల కోసం ఏప్రిల్ 9వ తేదీన సెలవు ప్రకటించారు. తమిళనాడు ఓటర్ల కోసం ఏప్రిల్ 23వ తేదీన ప్రత్యేక సెలవు వర్తించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున, అక్కడి ఓటర్ల కోసం ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీల్లో సెలవులను కేటాయించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించు కోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి ఓటు వేయడానికి తగిన సమయం కల్పించడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తించి, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

# ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ పై సీఎం మౌనం ఎందుకు?

## - ఫీజుల నియంత్రణ బిల్లుపై..

## ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఎందుకు పెట్టటం లేదు? : కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆగం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద రాష్ట్ర ప్రభుత్వానికి అంత ప్రేమెందుకని నిలదీశారు. మహిళా బిల్లు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి నప్పుడు లక్షలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. దీనిపై తెలంగాణ విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసి నెలలు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై ముఖ్యమంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.ముసాయిదా బిల్లు సిద్ధమైన తర్వాత కూడా భారీ ఎత్తున కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాయని గుర్తు చేశారు. సామాన్య ప్రజలు ఫీజులు చెల్లించలేక ఆగమవుతుంటే ప్రభుత్వం మాత్రం ఈ బిల్లును అటకెక్కించిందని మండిపడ్డారు. ఫీజుల దోపిడీ కారణంగా సామాన్య కుటుంబాల జీవితకాలపు పొదుపు మొత్తం హారతి కర్పూరంలా కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**నేడు సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం**

సింగరేణి సంస్థను కాపాడేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. బంజారా హిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, వివిద కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ, సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, అలియాస్ పేర్ల అంశం, కారుణ్య నియమాకాలు, సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

(మొదటి పేజీ తరువాయి)

బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# గడవు ముగుస్తోంది...

(మొదటి పేజీ తరువాయి)

విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది.గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపా ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

**వరంగల్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

(మొదటి పేజీ తరువాయి)

సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటు న్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ఫైర్‌వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని వివరించారు.

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు: కెటిఆర్

**హైదరాబాద్,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం పీఠాలు బీఆర్ఎస్ కైవసం కావడం హర్షణీయమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్నారు. అణచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో తావులేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని ఈ ఫలితాలు చెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# మారుమూల ప్రాంతాలకు మెరుగైన నెట్వర్క్ సేవలను అందించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.

**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో మారుమూల ప్రాంతాలకు మెరుగైన నెట్వర్క్ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో టెలికాం సేవలను మెరుగుపరచడం పై జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి విస్తరణ ఇతర పనుల తవ్వకాల సమయంలో సంబంధిత అధికారులు అండర్‌గ్రౌండ్ టెలికాం కేబుల్స్ దెబ్బతినకుండా ఉండేందుకు తప్పనిసరిగా కాల్ బిఫోర్ యు డిగ్ జదీబణ మొబైల్ యాప్‌ను వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే 'కాల్ బిఫోర్ యు డిగ్' మొబైల్ యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలని



సూచించారు. టి-ఫైబర్ , దీూచీూ మరియు ఇతర ప్రైవేట్ టెలికాం సంస్థలు అటవీ ప్రాంతాల్లో కేబుల్స్ వేయడానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరితగతిన పరిష్కరించాలని, టెలికాం టవర్ల ఏర్పాటులో ఎదురవుతున్న అనుమతుల సమస్యలను టవర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో ఉన్న జాప్యాన్ని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని మారుమూల





ప్రాంతాలకు కూడా మెరుగైన ఇంటర్నెట్ మరియు ఫోన్ నెట్‌వర్క్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డిఓ వెంకటేష్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, వివిధ టెలికాం కంపెనీల ప్రొవైడర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం హైదరాబాద్ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, బిఎల్వోఓ, బూతు ఏజంట్లు తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ములుగు కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.




గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం



6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



## ప్రజలకు అండగా భూక్య జంపన్న సేవలు

## రామచంద్రపురంలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

## శారదా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ములుగు సహకారంతో

**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం గ్రామీణ



ప్రాంతాల్లో ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని సేవలందిస్తున్న బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకుడు భూక్య జంపన్న మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. మల్లంపల్లి మండలంతో పాటు ములుగు జిల్లా కేంద్రం మరియు మారుమూల గ్రామాల్లోనూ ఆయన ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలో భూక్య జంపన్న ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. శారదా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ములుగు వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ ప్రశాంత్ నేతృత్వంలోని వైద్య బృందం పాల్గొని ప్రజలకు సేవలందించారు ఈ యొక్క వైద్య శిబిరం లో పాల్గొన్న వైద్య బృందం డాక్టర్ రవళి, తిరుపతి రావు నవీన్,ఫార్మాసిస్ట్, ఎం సలీం, చందన నర్స్, మల్లారెడ్డి తదితరులు శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు బీపీ, షుగర్, ఆక్సిజన్ స్థాయిల వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిబిరాన్ని వినియోగించుకున్నారు వైద్య సేవలు గ్రామానికి చేరడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ భూక్య జంపన్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, గ్రామాల్లో ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం తన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆరోగ్యం తనకు ముఖ్యమని, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రజల మధ్యే ఉండి, వారి అవసరాలను గుర్తించి సేవలందిస్తున్న నాయకుడిగా భూక్య జంపన్న ములుగు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారు .రామచంద్రపురం ఉప సర్పంచ్ అజ్మీర రాజేష్ గారు, సామాజిక వేత్త దొంతి విజేందర్ రెడ్డి గారు, దీటం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు రాజమౌళి గారు, వా. రమేష్ గారు, తదితరులు పాల్గొన్నారు

# మంత్రి రాజీనామా చేయాలి
# బీజేపీ నేత డా. జాడి రామరాజు

**ఏటూరునాగారం,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కర్నె సంపత్ ఆధ్వర్యంలో స్థానికంగా బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డా. జాడి రామరాజు మాట్లాడారు. మేడారం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాసిరకంగా నిర్వహించబడటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నిర్లక్ష్యం కారణంగా పూజారి సిద్ధబోయిన రమేష్ కుమారుడు తీవ్రంగా గాయపడి, కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వెంటనే రాజీనామా




చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలను మంత్రి వర్గం నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అవినీతి, అక్రమాలు పెరిగాయని విమర్శించారు. మేడారం అభివృద్ధి కోసం రూ. 250 కోట్లతో చేపట్టిన పనులు నాణ్యత లేకుండా నిర్వహించడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు గద్దల హరిబాబు, మాజీ ఎంపీటీసీ యర్రల యల్లయ్య, మండల ఉపాధ్య క్షుడు దుర్గం దుర్గారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీకేఎస్ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా 'పబ్బ ఉమ' నియామకం



**హసన్‌పర్తి, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (KGKS) జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా ముచ్చర్ల నాగారం గ్రామానికి చెందిన పబ్బ ఉమ రాజేందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. **మహిళల భాగస్వామ్యం అభినందనీయం:** ఈ సందర్భంగా బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కుల వృత్తిని కాపాడడంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా బాధ్యత తీసుకోవడం, సంఘ బలోపేతానికి ముందుకు రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యం సంఘానికి మరింత బలాన్నిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. **సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా:** తన నియామకంపై పబ్బ ఉమ రాజేందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, బండి రంజిత్ గౌడ్, హసన్‌పర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు మోటపోతుల రాజు, సంతోష్‌లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు.

# జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి తహసీల్దార్లు, డి టి లు, ఎం పి ఎస్ ఓ లు, ఆర్ ఐ లతో జనగణన, ఇండ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని, మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, సన్నాహక పనులు మొదలు పెట్టాలని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. చార్జెస్ (మండలాల) వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, 800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించాలని, ఎన్యుమరేటర్ బ్లాక్/ హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారు చేయాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాశ్, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు మంజుల, ఎస్ ఓ లాల్, డి టి లు, ఎం పి ఎస్ ఓ లు, ఆర్ ఐ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.




**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ మహేందర్ జి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని, తేమ శాతం కొలిచే పరికరాలు, బరువుతూకం యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని అన్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఓ పి ఎం ఎస్ ద్వారా వెంటనే నమోదు చేసి, ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, షెడ్లు, విశ్రాంతి సౌకర్యాలు కల్పించి రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని, ముందస్తు చర్యలలో భాగంగా అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని తార్పాలిన్లు ఇతర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి, జిల్లా సివిల్ సప్లై అధికారి ఫైసల్ హుస్సేని, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీం) వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** యునైటెడ్ టీం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ గారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంస్థ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగులు తమ సమస్యలను యునైటెడ్ టీం దృష్టికి తీసుకురావాలని, వాటికి తగిన ప్రాతినిధ్యం కల్పించి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీం సభ్యులు పాల్గొన్నారు. సయ్యద్ ఖాలిద్ హుస్సేన్ , జిల్లా అధ్యక్షులు, ములుగుసయ్యద్ అసద్ మొహియుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శిమొహమ్మద్ తాజ్ కోశాధికారిమొహమ్మద్ రఫీక్ ఉపాధ్యక్షులులాల్ మొహమ్మద్ ఉపాధ్యక్షులుషేక్ షగుఫ్తా మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీమరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ములుగులో ఉత్సాహంగా "రన్ ఫర్ జీసస్" ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్





**ములుగు,ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి గారు జెండా ఊపి ఈ పరుగును ప్రారంభించారు. యేసుక్రీస్తు పునరుత్థాన సందేశాన్ని, ప్రేమను, శాంతిని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, 8వ వార్డు కౌన్సిలర్ నల్లెల్ల స్వాతి భరత్, పాస్టర్ సుదర్శన్ మరియు ఇతర సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దలైలామాను కలిసిన బీసీ నేత డాక్టర్ అరుణ కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** హిమాచల్ ప్రదేశ్ లోని టెన్జిన్ గ్యాట్సో (14వ దలైలామా)ను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తనయుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. అరుణ్ కుమార్ కలిసి టిబెట్ ప్రజల స్వేచ్ఛ కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా అహింసా మార్గంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన దలైలామా అరుణ్ కుమార్ ను ప్రోత్సహిస్తూ ఆశీస్సులు అందజేశారు. శాంతి, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన దలైలామా మార్గదర్శనం యువతకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ బేటి సామాజిక న్యాయం, మానవ హక్కులు, శాంతి కోసం కృషి చేసే నాయకుల మధ్య స్ఫూర్తిదాయకమైన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల విమర్శలు వారి అభద్రతా భావానికి నిదర్శనం బీఆర్ఎస్ నాయకురాలు కొమరం ధనలక్ష్మి




**ములుగు జిల్లా,ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మేడారం పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబాన్ని మానవతా దృక్పథంతో పరామర్శించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు వారి అభద్రతా భావానికి నిదర్శనమని బీఆర్ఎస్ ములుగు జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.మేడారం జాతరలో పనుల లోపం కారణంగా ఒక బాలుడు తీవ్రంగా గాయపడి అంగవైకల్యం చెందిన నేపథ్యంలో, బాధలో ఉన్న పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబాన్ని లక్ష్మణ్ బాబు పరామర్శించడం మానవత్వానికి నిదర్శనమని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా విమర్శించడం సిగ్గుచేటని అన్నారు.లక్ష్మణ్ బాబు జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారని కొనియాడారు. ఆయన సేవా కార్యక్రమాలను చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు.ములుగు జిల్లాలో లక్ష్మణ్ బాబు సుడిగాలి పర్యటనలు, ప్రజల్లో ఆయనకు పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోతుందనే భయం ఆ పార్టీ నాయకుల్లో నెలకొన్నదని ధనలక్ష్మి ఎద్దేవా చేశారు.అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టకుండా కేవలం విమర్శలకే పరిమితమైతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.ఇట్లు:కొమరం ధనలక్ష్మిబీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు

# మృత్యుంజయుడి సందేశం.. మానవాళికి నూతన ఉత్తేజం..!

చీకటి ఎంత గాఢంగా ఉన్నా వెలుగు కిరణం దానిని చీల్చుకుని వస్తుంది. మరణం ఎంత భీకరంగా ఉన్నా జీవం దానిని జయించి తీరుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు జరుపుకునే 'ఈస్టర్' పండుగ ఈ సత్యానికే నిలువెత్తు సాక్ష్యం. క్రైస్తవ విశ్వాసానికి ప్రాణవాయువు వంటి ఈ పండుగ, లోక రక్షకుడైన ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన అద్భుత ఘట్టాన్ని చాటిచెబుతుంది. ఇది కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీ కాదు, మానవజాతి చరిత్రను మలుపు తిప్పిన ఒక గొప్ప ఆధ్యాత్మిక విప్లవంగా చెప్పొచ్చు. ఎందుకంటే చరిత్రను క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని రెండుగా విభజించిన ఘనత కేవలం ఒక వ్యక్తి జననానికో, మరణానికో సంబంధించింది కాదు. అది ఆయన సాధించిన 'పునరుత్థానాని'కి సంబంధించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది హృదయాల్లో నిరీక్షణ దీపాలను వెలిగించే 'ఈస్టర్' పండుగ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు, అది మరణంపై జీవం సాధించిన అజేయ విజయం. చీకటి ఎంత గాఢంగా ఉన్నా వెలుగు కిరణం దానిని చీల్చుకుని వస్తుందని, అన్యాయం ఎంత బలంగా ఉన్నా ధర్మం దానిని జయించి తీరుతుందని చాటిచెప్పే చారిత్రక సాక్ష్యం ఈస్టర్.క్రైస్తవ మతంలో అత్యంత పవిత్రమైన, ప్రాముఖ్యత కలిగిన పండుగ ఈస్టర్. లోక రక్షకుడిగా నమ్మబడే ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన అద్భుతాన్ని ఈ పండుగ చాటిచెబుతుంది. ఇది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక మాత్రమే కాదు, ఒక సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణానికి ముగింపు. క్రైస్తవ విశ్వాసం ప్రకారం, సుమారు రెండు వేల ఏళ్ల క్రితం యూదుల పస్కా పండుగ సమయంలో ఏసుక్రీస్తును సిలువ వేశారు. ఆయన మరణించిన మూడవ రోజున (ఆదివారం) సమాధి నుండి సజీవంగా లేచారు. ఈ పునరుత్థానమే క్రైస్తవ ధర్మానికి పునాది. "ఆయన ఇక్కడ లేడు, ఆయన లేచియున్నాడు" అన్న దేవదూత మాటలు ఈ పండుగకు మూలం. ఈస్టర్ కంటే ముందు వచ్చే పవిత్ర దినాలు ఈస్టర్ వేడుకలు ఒక క్రమ పద్ధతిలో జరుగుతాయి.లెంట్ కాలంగా చెప్పుకునే రోజులుగా ఈస్టర్‌కు ముందు 40 రోజుల పాటు భక్తులు ఉపవాసాలు ఉంటూ, ప్రార్థనలలో గడుపుతారు. ఇది



ఆత్మశోధనకు పశ్చాత్తాపానికి సమయం. ఏసుక్రీస్తు జెరూసలేం నగరంలోకి ప్రవేశించినప్పుడు ప్రజలు ఖర్జూర మట్టలతో స్వాగతం పలికిన జ్ఞాపకార్థం దీనిని జరుపుకుంటారు. పరిశుద్ధ గురువారంగా ఏసుక్రీస్తు తన శిష్యులతో కలిసి చివరి భోజనం చేసిన రోజు. ప్రేమ, సేవ, వినయానికి ప్రతీకగా ఆయన తన శిష్యుల పాదాలను కడిగిన సందర్భాన్ని ఈ రోజు స్మరించుకుంటారు. శుభ శుక్రవారంగా మానవాళి పాప పరిహారం కోసం ఏసుక్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేసిన రోజుగా భావిస్తుంటారు. ఇది విచారంతో కూడిన రోజైనప్పటికీ, రక్షణ మార్గం సుగమమైందని దీనిని 'గుడ్' ఫ్రైడేగా పిలుస్తారు. ఏసుక్రీస్తు సమాధి నుండి తెల్లవారుజామున లేచారు కాబట్టి, భక్తులు సూర్యోదయానికి ముందే చర్చిలలో లేదా బహిరంగ ప్రదేశాలలో కూడి ప్రార్థనలు చేస్తారు. పురాతన కాలం నుండి గుడ్డును కొత్త జీవానికి చిహ్నంగా భావిస్తారు,ఈస్టర్ గుడ్లుగా చెస్తారు. సమాధిని చీల్చుకుని ఏసు బయటకు వచ్చినట్లుగా, గుడ్డును పగలగొట్టి జీవం బయటకు వస్తుందని దీని అర్థం. నేడు వీటిని రంగురంగుల చాక్లెట్లుగా, అలంకరణ వస్తువులుగా పంచుకోవడం ఆనవాయితీ. తెల్లని లిల్లీ పూలు పవిత్రతకు, ఆశకు సంకేతంగా ఈస్టర్ లిల్లీలను, ఈస్టర్ సమయంలో చర్చిలను ఈ పూలతో ఎంతో అందంగా అలంకరిస్తారు. ఇలా ఈస్టర్ పండుగ సమాజానికి గొప్ప నైతిక విలువలను బోధిస్తుంది. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, మరణంపై జీవం సాధించిన విజయసంకేతంగా చెప్పొచ్చు. తనను హింసించిన వారిని కూడా క్షమించమంటూ క్రీస్తు చూపిన మార్గం ఈ పండుగలో కనిపిస్తుంది. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, మరణం వంటి అంతిమ దశ ఎదురైనా... ఆ తర్వాత ఒక కొత్త ఉదయం ఉంటుందనే నమ్మకాన్ని ఇది కలిగిస్తుంది. ఈస్టర్ పండుగ కేవలం క్రైస్తవులకు మాత్రమే పరిమితం కాకుండా, లోకమంతటికీ శాంతి, సోదరభావాన్ని పంచుతుంది. పాత ఆలోచనలను, ద్వేషాన్ని వీడి, ప్రేమతో కూడిన నూతన జీవితాన్ని ప్రారంభించమని ఈ పండుగ మనల్ని ప్రోత్సహిస్తుంది. నిరాశలో ఉన్నవారికి నిరీక్షణను, బలహీనులకు ధైర్యాన్ని ఇచ్చే ఈ పండుగ మానవజాతికి ఒక గొప్ప వరంగా చెప్పక తప్పదు.



అంతడుపుల శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ - వరంగల్

# పాప భారమును తొలగించిన లోక రక్షకుడు ఏసుక్రీస్తు

**మానవాళికి నిత్య రాజ్యమును సిద్ధం చేసిన యేసుక్రీస్తు**

**కల్లూరులో ఘనంగా రన్ ఫర్ జీసస్**

**ప్రేమ, క్షమాపణల సందేశంతో మార్మోగిన పట్టణం**

**గుడ్ ఫ్రైడే ఈస్టర్ సందర్భంగా ప్రత్యేకమైన ప్రార్థనలు**

**కల్లూరు, ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మానవాళి పాప వారము తొలగించి నిత్య రాజ్యాన్ని అనుగ్రహించుట కొరకు లోక రక్షకుడిగా ఏసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి మానవ రూపం ధరించుకొని వచ్చాడని అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్ అన్నారు. శనివారం కల్లూరు మున్సిపాలిటీలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఎఐసిసి మండల కమిటీ అధ్యక్షులు రెవరెండ్ తేళ్ల ఎబినేజర్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, క్షమాపణల సందేశాన్ని ప్రజల్లో విస్తరించాలనే ఉద్దేశంతో ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రేయర్ సెల్ అధ్యక్షులు రెవరెండ్ నిర్మల్ కుమార్ ప్రార్థనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఎన్ఎస్పి క్రాస్ రోడ్డు నుండి నూతన బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించగా, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.ముఖ్య అతిథుల చేత రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ సురేష్, సిఎస్ఐ చర్చ్ పాస్టర్ రెవరెండ్ భాస్కరరావు హాజరై రిబ్బన్ కట్ చేసి ర్యాలీని ప్రారంభించారు. వారు ర్యాలీలో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు.యేసు సందేశం ప్రపంచానికి మార్గదర్శకం అని తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్య అతిథులు యేసుక్రీస్తు ప్రభువు నరవతారీగా లోకానికి వచ్చాకే ప్రేమ, క్షమాపణల అసలైన అర్థం మానవాళికి తెలిసిందని తెలిపారు. యేసు ప్రభువు బోధనలు ప్రపంచానికి శాంతి,











సమాధానాన్ని అందించాయని పేర్కొన్నారు. ఆయన జననం, సిలువపై మరణం, పునరుత్థానం ద్వారా మానవాళికి నిత్య రక్షణ, నిత్యజీవం, నిత్య రాజ్యాన్ని సిద్ధం చేశారని వివరించారు.యేసు క్రీస్తు పాపభారాన్ని తొలగించేందుకు లోకరక్షకుడిగా ఈ లోకానికి వచ్చాడని, మానవాళికి సమాధానం చూపించేందుకు సమాధానకర్తగా జన్మించాడని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో శాంతి, సౌభాగ్యం నెలకొంటుందని పేర్కొన్నారు.గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పర్వదినాల సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేశ క్షేమం, శాంతి, భద్రత, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమం కల్లూరులో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ ఏసుక్రీస్తు సందేశాన్ని ప్రజలలో విస్తరించిన ఒక విశేష కార్యక్రమం గా నిలిచింది.మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షులు రెవరెండ్ ఎబినేజర్, నియోజకవర్గ అధ్యక్షులు పీడీ దాసు, కన్వీనర్ కెనడి రాజు, గౌరవ సలహాదారులు బ్రదర్ టి. సంజీవరావు, ఎఐసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుమాళ్ల దయాకర్, వైస్ ప్రెసిడెంట్ జాన్ పరంజ్యోతి, సుందర్ రాజు, ప్రధాన కార్యదర్శి రాయల తిమోతి, కోశాధికారి గౌడిపేరు జీవన్ కుమార్, మండల నాయకులు మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదూరి రాజశేఖర్, ప్రచార కార్యదర్శి థామస్, బాల సుందరం, షాలెం దాసన్న, భాస్కర్, సత్తుపల్లి మండల అధ్యక్షులు రవి, తల్లాడ, వైరా మండలాల నాయకులు, యూత్ నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఎంహెచ్డీ ఖమ్మం నగరానికి కొత్త నాయకత్వం నగర అధ్యక్షుడిగా కుక్కల రామకృష్ణ, కార్యదర్శిగా పరికముక్కుల విజయ్‌కుమార్ నియామకం

**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఖమ్మం నగరానికి కొత్త నాయకత్వాన్ని నియమించారు. టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాల మేరకు కుక్కల రామకృష్ణ (ఆర్కే)ను నగర అధ్యక్షుడిగా, పరికముక్కుల విజయ్‌కుమార్‌ను నగర కార్యదర్శిగా నియమించారు.సంస్థ నిర్మాణంలో భాగంగా ఖమ్మం నగరంలోని టీఎంహెచ్డీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నియామకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కుక్కల రామకృష్ణ మరియు పరికముక్కుల విజయ్‌కుమార్ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.ఖమ్మం నగరంలోని మాదిగ




జనాభా అధికంగా ఉన్న డివిజన్లలో కమిటీలను ఏర్పాటు చేసి, సంస్థను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయివరకు బలోపేతం చేయాలని కొత్తగా నియమితులైన నాయకులకు సూచించారు.నూతనంగా నియమితులైన నాయకులకు జిల్లా ప్రచార కార్యదర్శి కనకపుడి వీరస్వామి మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆధూరి బాలకృష్ణ మాదిగ, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ బొడ్డు వెంకయ్య బాబు మాదిగ, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి మధు మాదిగ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జరుపోతుల నరేష్ మాదిగ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పడిశాల వెంకన్న మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ జంగం వెంకయ్య మాదిగ, ఖమ్మం ఇన్‌చార్జ్ జంగం నగేష్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వకుండా

# ఇబ్బందులు పెడుతున్నారు

### విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు పద్మ

**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత సంవత్సర కాలంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన అమ్మడి పూడి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమ్మడి పూడి పద్మ మాట్లాడుతూ... తన తండ్రి అమ్మడి పూడి సత్యం కు మొదటి భార్య మంగమ్మకు ఐదుగురు సంతానమని , రెండో భార్య భాగ్యమ్మకు ఒక కుమారుడు జన్మించాడని, తన తండ్రి తో పాటు ఇద్దరు భార్యలు కూడా మృతి చెంది చాలా కాలం అవుతుందని తెలిపారు. ఇద్దరు భార్యలకు కలిగిన సంతానానికి ఉమ్మడిగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం కామేపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంలో గత సంవత్సరం క్రితం ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయడం జరిగిందని తెలిపారు. సర్టిఫికెట్ కోసం తహసిల్దార్ ను కలిస్తే ఆర్ ఐ ని కలవమని, ఆర్ ఐ ని కలిస్తే వీఆర్వో ను కలవమని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కుటుంబ సభ్యులు కలిసి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన సకాలంలో సర్టిఫికెట్ ఇవ్వకుండా చెప్పులు అరిగేలా తిరిగిన సర్టిఫికెట్ ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొనే హక్కు తమకు ఉందని, కానీ కామేపల్లి మండల తాసిల్దార్ కార్యాల యంలో అధికారుల తీరు అభ్యంతరకరంగా, అనాలో చిత చర్యగా ఉందని, జిల్లాలో బహుశా రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా కేవలం కామేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలోనే ఇటువంటి వింత ప్రవర్తన కలిగి ఉండటం విచారకరమని మండిపడ్డారు.




ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని తక్షణమే తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటన మరెవరికి రాకూడదని వేడుకున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ ఇతర ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ములుగు జిల్లా కేంద్రంలో JPL సీజన్ 3 మెగా క్రికెట్ టోర్నమెంట్

### JPL సీజన్ 3 మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్

### కోపెల కిరణ్ కుమార్ తన తండ్రి కీ.శే. కోపెల జనార్దన్ జ్ఞాపకార్థం





**ములుగు జిల్లా,ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**కోపెల కిరణ్ కుమార్ తన తండ్రి కీ.శే. కోపెల జనార్దన్ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను వరుసగా మూడవ ఏడాది నిర్వహిస్తున్నారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో పాల్గొనాలని రవిచందర్ ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ లక్ష్యం వైపు సాగాలని క్రీడాకారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, బీసీ సెల్ ప్రతినిధి గంద్రత్ జయాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కుల రేవంత్ యాదవ్, గూడెపు రాకేష్, పైడిమల్ల రాజేష్ మరియు టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు

# కార్పొరేషన్ గడ్డపై కాషాయ జెండా ఎగరాలి!

### కాంగ్రెస్ వంచనను ఎండగట్టండి.

### కేంద్ర సంక్షేమాన్ని చాటిచెప్పండి

### బీజేపీ జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి పిలుపు.

**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కదలాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం నగరంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ఎటువంటి అంచనాలు లేకుండా, కేవలం గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ఈ వైఫల్యాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని ఆయన కోరారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని, వారి



అసలు రంగును బయటపెట్టాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాలని మహిపాల్ రెడ్డి సూచించారు. దేశం మొత్తం మోదీ నాయకత్వాన్ని బలపరుస్తుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తోందని విమర్శించారు. అభివృద్ధి అనేది కేవలం బీజేపీతోనే సాధ్యమని, కార్పొరేషన్ ఎన్నికల్లో క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల మద్దతు కూడగట్టాలని ఉద్బోధించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని, ఇందుకోసం పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపైకి రావాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగి, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో బీజేపీ బలాన్ని నిరూపించాలని ఆయన ఆకాంక్షించారు. సంస్థాగత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకుపోవడంతో పాటు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తగా నియామకమైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్ , వాకధాని పుల్లారావు యాదవ్, గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వరరావు, ఇవి రమేష్, రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్ , విజయరాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రావ్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



**గంగాధర ఏప్రిల్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు తేది 5/4/2026 రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే భారత మాజీ ఉప ప్రధాని,సమతవాది పూజ్య జగ్జీవన్ రాం జయంతి ఉత్సవ సభను చొప్పదండి శాసన సభ్యులు,డీసీసీ అధ్యక్షులు గౌరవనీయులు డాక్టర్ మేడిపల్లి సత్యం చైర్మెన్ గా పెద్ద ఎత్తున నిర్వహించబడును. 119 వ జయంతి ఉత్సవ పోస్టర్ ను ఈ రోజు గంగాధర మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనంలో వైస్ చైర్మన్ లు తాళ్ళ సురేష్,బెజ్జంకి అనిల్ ల ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్,మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్ సీనియర్ నాయకులు దోమకొండ మల్లయ్య ఎలుక అంజన్న ,తాళ్ళ స్వామి శనిగరం నరేష్ గంగాధర రఘు గంగాధర నగేష్ తాళ్ళ శేఖర్ గంగాధర రమేష్ గంగాధర రవి తాళ్ళ లక్ష్మన్ తడగొండ శంకర్ శ్రీకాంత్ సుధాకర్ రమేష్ సుమంత్ లు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డి నగర్‌లో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయండి




### బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు

### వెంకటరెడ్డి నగర్ డెవలప్మెంట్ వెల్ఫేర్

### అసోసియేషన్‌కు ఎన్నికలు ఎప్పుడు..?

### నెలలు గడుస్తున్న జరగని ఎన్నికలు...

**ఉప్పల్ ఏప్రిల్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):**వెంకటరెడ్డి నగర్ బస్టాండ్లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు దేవేందర్ గౌడ్ నిధులతో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ కమర్షియల్ నిర్మాణాలకు ఉపయోగిస్తున్నారని ప్రజలకు ఉపయోగంగా ఉండేవిధంగా బస్ షెల్టర్ ను అక్కడ నిర్మించాలని ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారులు ఈ విషయం పై నిర్ణయం తీసుకోవాలని ప్రయాణికులు కోరుచున్నారు. ప్రతి కాలనీలో ఎన్నికలు నిర్వహిస్తున్న వెంకట్ రెడ్డి నగర్ కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించలేదని ఇష్టానుసారంగా కొత్త సభ్యులను వాళ్లంతల వాళ్లే ప్రకటించుకుంటూ రాచరిక పోకడలను కొనసాగిస్తున్నారని కాలనీ అభివృద్ధి విషయంలో పట్టించుకోవడంలేదని, మాజీ రాజ్యసభ సభ్యులు దేవేందర్ గౌడ్ రాజ్యసభ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్ లో కమర్షియల్ నిర్మాణాలు నిర్మించి కిరాయికి ఇచ్చి కాలనీ అభివృద్ధి సంక్షేమ పనులకు వాడుకుంటున్నారని, ప్రయాణికులు ఎండలో వానలో నిలబడి అవస్థలు పడుతున్నారని తప్పనిసరిగా అక్కడ బస్సు షెల్టర్ ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రయాణికులు కోరారు.కాలనీలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎవరికివారు ఇష్టానుసారంగా ఉంటున్నారని, వెంకట్ రెడ్డి నగర్ బస్టాండ్లో పోలీస్ ఔట్ పోస్టింగ్ ఉన్నా కూడా పోలీసులు ఉండకపోవడంతో అ సాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని, తప్పనిసరిగా ఓ కానిస్టేబుల్ అక్కడ ఉండే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోవాలని, బస్టాండ్లో ఇష్టానుసారంగా కార్లను పార్కు చేయడం వల్ల అందరికీ ఇబ్బందిగా ఉంటుందని బస్టాండ్లో కార్లు పార్క్ చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.వెంకట్ రెడ్డి నగర్ లో సొంత ఇంటి వారికి ఓటు హక్కును కల్పించాలని, నిన్న మొన్న వచ్చినవాళ్లు అధికారం చేపట్టాలని చూస్తున్నారని, ప్రజల కోసం కాలనీ అభివృద్ధి కోసం కష్టపడ్డ వారికి గుర్తించి తగిన న్యాయం చేయాలని, కాలనీవాసులు ఆలోచించవలసిన సమయం ఆసన్నమైనదని కాలనీ భాగస్వామ్యంలో అందరం పాటు పడదామని, బస్ స్టాప్ కు వచ్చిన వృద్ధులకు టాయిలెట్స్ కూడా అక్కడ లేవని వెంటనే టాయిలెట్స్ ని ఏర్పాటు చేయాలని, రాజకీయాలను పక్కనపెట్టి కాలనీ అభివృద్ధికై అందరు పాటుపడదామని కాలనీ అభివృద్ధి సంక్షేమమే మన అందరి లక్ష్యమని ఒకరు చెప్తే వినే పరిస్థితిలో ఏవరము లేమని అందరమూ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని కాలనీవాసులు తెలిపారు.




## ఫ్రీజ్‌లకు బదులు కుండలు వాడండి: కౌన్సిలర్ రాంబాబు పిలుపు




**కల్లూరు, ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పట్టణంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మట్టి కుండల వినియోగాన్ని ప్రోత్సహించాలని మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు పిలుపునిచ్చారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక పాత్రికేయులకు కుండలు బహుకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎండలలోనూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ కష్టపడుతున్న పాత్రికేయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి కృషికి గుర్తింపుగా ఈ చిన్న కానుక అందజేస్తున్నామని చెప్పారు.అలాగే ఫ్రీజ్‌లలో నిల్వ చేసిన నీటికి బదులుగా మట్టి కుండల్లో నిల్వ చేసిన నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. కుండ నీరు సహజంగా చల్లగా ఉండటమే కాకుండా శరీరానికి హానికరం కాదని తెలిపారు.వేసవి కాలంలో ప్రజలు ఎక్కువగా కుండల వినియోగం పెంచి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కూడా కుండల వినియోగం దోహదపడుతుందని రాంబాబు అన్నారు.

# ప్రేమను పంచడమే యేసు తత్వం...





- 'రన్ ఫర్ జీసస్'లో ఎమ్మెల్యే కవ్వంపల్లి...

**కరీంనగర్,ఏప్రిల్04(పీసీడబ్ల్యూ న్యూస్):** మానవాళికి ప్రేమ పంచడమే యేసుక్రీస్తు తత్వమని మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.శనివారం కరీంనగర్లో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేయడం, పేదలను కనికరించడమే ఏసుక్రీస్తు తత్వమన్నారు. కరుణామయుడైన యేసు క్రీస్తు ప్రేమను ప్రపంచ మానవాళికి పంచాలన్నదే రన్ ఫర్ జీసస్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవ్యం మతం కాదని, అది ఒక సన్మార్గమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీడీవో కుమారుని పెళ్లి ఎమ్మెల్యే హాజరు**

తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నాగపూర్ మల్హోత్రా – సుమలత దంపతుల పుత్రుడు ఆశిష్ మెమో వివాహానికి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. హైదరాబాద్ లోని నిమ్మల కన్వెన్షన్ లో శనివారం జరిగిన ఈ వివాహ వేడుకకు డాక్టర్ కవ్వంపల్లి హాజరై నూతన వధూవరులను ఆశీస్సులు అందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏఐవిఎఫ్ జాతీయ సలహాదారుడిగా సీనియర్ జర్నలిస్టు పుండరీ చారి నియామకం



**హైదరాబాద్ ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్( ఏఐవిఎఫ్) జాతీయ సలహాదారుడిగా తెలంగాణ రాష్ట్ర మీడియా వింగ్ కోఆర్డినేటర్ గా సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి నూతనంగా నియమితులయ్యారు.ఈ మేరకు ఏ ఐ వి ఎఫ్ జాతీయ వ్యవస్థాపకులు జైన్ కుమార్ విశ్వకర్మ, జాతీయ ప్రధాన కార్యదర్శి చిన్నయ్య జగదీష్ ఆచారి లు నియామక ఉత్తర్వులు జారీ చేశారని జాతీయ కార్యదర్శి వి ఎం లక్ష్మీనరసింహ సేనా చారి తెలిపారు, పుండరీ చారి మూడేళ్ల పాటు ఈ రెండు పదవిలో కొనసాగుతారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జే. పుండరీ చారి మాట్లాడుతూ ఏఐవిఎఫ్ ను దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికి నా వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాలలోని విశ్వకర్మలను ఏకం చేసి విశ్వకర్మలలో ముఖ్యంగా యువతీ యువకులు,మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టే విధంగా రాజకీయ చైతన్యం తీసుకువస్తానని ఆయన చెప్పారు.చేతివృత్తులను ఆధునికరించాలని, విశ్వకర్మలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి సెప్టెంబర్ 17 ను సెలవు దినంగా ప్రకటించి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ సలహాదారుడు గా నియమించినందుకు ఏఐవిఎఫ్ వ్యవస్థాపకులు జైన్ కుమార్ విశ్వకర్మ తో పాటు పలువురికి ఈ సందర్భంగా పుండరీ చారి కృతజ్ఞతలు తెలిపారు.

# దేశ సరిహద్దులు దాటిన స్నేహం

- 35 ఏళ్ల తరువాత కలుసుకున్న నిక్కరు దోస్తులు

**హైదరాబాద్ ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ట్రెండ్ మారినా.. తరాలు మారినా.. ఫ్రెండ్షిప్ మాత్రం మార దు. 35 ఏళ్ల తర్వాత మిత్రులు (పాత స్నేహితులు) కలవడం ఒక అద్భుతమైన అనుభూతి. ఈ వయసులో, కెరీర్, కుటుంబ బాధ్యతల మధ్య మర్చిపోయిన పాత జ్ఞాపకాలు, మధురమైన అనుభూతులు, నిష్కల్మషమైన స్నేహం మళ్ళీ చిగురించింది.జీవితంలో ఎంత మంది దోస్తులున్నా టెన్త్ క్లాస్‌మేట్స్ మాత్రం చాలా ప్రత్యేకం. అప్పుడు బలపడిన స్నేహం జీవితంలో అన్ని దశల్లోనూ తోడుగా నిలుస్తూనే ఉంటుంది. లైఫ్‌లో ఎంత గొప్ప స్థాయికి వెళ్లినా సరే.. చిన్ననాటి దోస్తులు కలిసి కాసేపు కబుర్లు చెప్పుకుంటే ఆ ఆనందమే వేరు.మళ్లీ ఆ రోజుల్లోకి అలా తొంగి చూస్తే కలిగే ఫీలింగ్ మధురంగా ఉంటుంది. కాలం మారుతున్నా, స్నేహ బంధాలు మాత్రం ఇప్పటికీ తరగడం లేదనడంలో అతిశయోక్తి లేదు.అయితే ప్రస్తుత బీజీ లైఫ్ కావచ్చు, ఉన్నత చదువుల కోసం కావచ్చు. ఉద్యోగ, ఉపాధి కోసమో అప్పటిదాకా ఒక్కచోట ఉన్న దోస్తులంతా దూరమవుతుంటారు. ఇలా ఎప్పుడో తెరపడిన స్నేహ బంధాన్ని ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం 'సోషల్ మీడియా' మళ్లీ కలుపుతుండగా, ఇప్పటికీ కొనసాగుతున్న స్నేహాన్ని మరింత పటిష్టపరుస్తున్నది. 'ఫేస్‌బుక్', వాట్సాప్ 'ట్విట్టర్' తదితర సామాజిక మాధ్యమాలు స్నేహ వారధుల్లా మారిపోయాయి.ఏ దేశంలో ఉన్న, ఏ రాష్ట్రంలో ఉన్నా వాట్సప్ గ్రూప్ అందరు స్నేహితులు అందుబాటులో ఉంటున్నారు. చెడ్డి దోస్తులు, పది దోస్తానా ఇంటర్ కింగ్స్, డిగ్రీ దోస్తులు, పీజీ ఫ్రెండ్స్.. ఇలా ఫోన్‌లో రకరకాల గ్రూపులు క్రియేట్ చేసుకుని తమ స్నేహాన్ని చాటుకుంటున్నారు.ఈ కోవలోనే వారణాసి సుధాకర్ చారి, శశీ అనే ఇద్దరు ఫ్రెండ్స్ సుదీర్ఘ కాలం అంటే 35 ఏళ్ల తరువాత కలుసుకుని పాత జ్ఞాపకలను నెమరేసుకున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం, పామాపురం గ్రామానికి చెందిన సుధాకర్ వరంగల్‌లో నయింనగర్ లోని సి.వి.రామన్ స్కూల్లో 10 వ తరగతి చదివారు. అప్పుడు స్కూల్‌లో బెస్ట్ ఫ్రెండ్‌గా ఉన్న శశి ఉన్నత చదువులు అయిపోయాక ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. అయితే, ఆ బ్యాచ్ కు చెందిన ఓ ఫ్రెండ్ వాట్సప్ క్రియేట్ చేయడంతో అందరూ ఈ వేదికపై కలుసుకుని ముచ్చటించుకునే వారు. కాని ప్రత్యక్షంగా కలిసిన సందర్భాలు అస్సలు లేవు. అయితే, వ్యక్తిగత పని నిమిత్తం ఆస్ట్రేలియా నుంచి శశి హైదరాబాద్‌కు రావడంతో విషయం తెలుసుకున్న సుధాకర్ ప్రత్యేకంగా కలుసుకున్న సమయంలో ఇద్దరూ భావోద్వేగానికి గురయ్యారు. మూడు దశాబ్దాల క్రితం నాటి పాఠశాల కబుర్లను సింహావలోకనం చేసుకున్నారు. మానవ జన్మకు తరగని ఆస్తి ఉందంటే అది ఒక స్నేహమే అని సుధాకర్ పేర్కొన్నారు.



## నాంచారమ్మ జాతరకు సౌకర్యాలు కల్పించాలి

**కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతి పత్రం అందించిన ఎరుకల సంఘం నాయకులు**



**ములుగు జిల్లా,ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మే 1 నుంచి నిర్వహించనున్న నాంచారమ్మ జాతరకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం సమర్పించారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లోకిని రాజు మాట్లాడుతూ, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సమీపంలో ఉన్న 800 సంవత్సరాల చరిత్ర కలిగిన నాంచారమ్మ ఆలయం (పంచకూటాలయం) ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.2017 సంవత్సరం నుంచి తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఈ జాతరను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర, జిల్లా కమిటీల సహకారంతో జాతరను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈసారి జాతరను మరింత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ వంటి సదుపాయాలను ముందుగానే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా మే 1న జరిగే నాంచారమ్మ జాతరకు కులమతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు హాజరవుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎరుకల కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు.ఆదివాసి ఎరుకల జాతి ఆత్మగౌరవాన్ని, ఉనికిని చాటేలా ఈ జాతరను నిర్వహించేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లకొండ ఎల్లస్వామి, మహిళ జిల్లా అధ్యక్షురాలు పాలకుర్తి ప్రమీల, జిల్లా నాయకులు జగన్నాథం రాంబాబు, జగన్నాథం సాగర్, కూరాకుల సారమ్మ, దేవరాయ కృష్ణ, దేవరాయ రేణుక, పాలకుర్తి విజయ, పల్లకొండ వెంకటేష్, పల్లకొండ వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో చదువు కుని ఉన్నత స్థాయికి ఎదగాలి ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు







**రామడుగు ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు అని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు విద్యార్థులకు సూచించారు. శనివారం రామడుగు మండలం గోపాలరావు పేటలోని అక్షర పాఠశాల ఆవరణలో వార్షికోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ యాదగిరి శేఖర్ రావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం అర్బన్ ప్రాంతాల నుండి కాకుండా గ్రామీణ పేద విద్యార్థులే ఉన్నత లక్ష్యాలను సాధిస్తున్నారని అన్నారు.. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర నరేష్ గౌడ్ ట్రస్మ రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మాజీ సర్పంచ్ కర్ర సత్య ప్రసన్నారెడ్డి కర్ర అశోక్ రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునిందర్ రాధ వార్డు సభ్యులు ఉపాధ్యాయుల బృందం తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.






## చిన్నబోయినపల్లిలో సీసీటీవీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం

**ములుగు జిల్లా,ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చిన్నబోయినపల్లి:గ్రామంలో భద్రతను మెరుగుపర్చే లక్ష్యంతో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై మహేష్, గ్రామ సర్పంచ్ నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇళ్ల వద్ద, ముఖ్య ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సర్పంచ్ నాగార్జున మాట్లాడుతూ గ్రామ భద్రత అందరి బాధ్యత అని, సీసీటీవీ వ్యవస్థ ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపడతాయని అన్నారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించి భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా: దైవ రవీందర్

**రామన్నపేట ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బండపాలెం గ్రామానికి చెందిన మారం సత్తి రెడ్డి సతీమణి మారం రేణుక గుండెపోటుతో మృతి చెందడంతో వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోళ్ళ వెంకటరెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేరెడ్డి ప్రవీణ్ రెడ్డి ముద్దం విజయ్ బొట్టు వెంకన్న రంగారెడ్డి కిరణ్ జ్యోతి బస్ ఏసోబు శ్రీనివాస్ రెడ్డి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పోరాటం అభినందనీయం

- ఇళ్ల స్థలాల ఉద్యమానికి నా సంపూర్ణ మద్దతు..: ప్రముఖ యూట్యూబర్ తొలివెలుగు రఘు వెల్లడి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల ప్రధాన హక్కు ఇళ్ల స్థలాలని, ఆ సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీనియర్ జర్నలిస్టు టీఎస్ చక్రవర్తి టిడబ్ల్యుజేఎఫ్ యూనియన్ లో జిల్లా అధ్యక్ష హోదాలో అనేక నిరసన, వినతుల కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని అదే ఉద్యమ స్ఫూర్తితో సంతోష్ చక్రవర్తి అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం చేపడుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రముఖ యూట్యూబర్ తొలివెలుగు రఘు అన్నారు. సంతోష్ చక్రవర్తి గత డిసెంబర్ నెలలోనే నాటి యూనియన్ ద్వారా ఈ అంశాన్ని లేవనెత్తి తెలంగాణ రాష్ట్ర నలు దిశల వ్యాపించేలా చేసిన ఉద్యమ కార్యచరణ మనందరికీ తెలిసిందేనని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్, మీడియా అకాడమీ చైర్మన్, పలు రాజకీయ పార్టీల జాతీయ స్థాయి నాయకులు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి, ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్ కు వినతిపత్రాలు సమర్పించి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సాక్షాత్తు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి, చక్రవర్తి పనిచేసిన యూనియన్ కు ఆనాడు అందించిన సలహాలు, సూచనలు అభినందనీయం. కొన్ని అనివార్య కారణాల వలన చక్రవర్తి ఆ యూనియన్ పదవికి రాజీనామా చేసినప్పటికీ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం తన పోరాటం కొనసాగుతుందని యూటూబర్ రఘు స్పష్టం చేశారు. చక్రవర్తి తన 'పదవికి రాజీనామా చేశారుడ పోరాటానికి కాదు" అని చెప్పడం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకు ఆయన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం వ్యక్తిగత సమస్య కాదని, ఇది మొత్తం జర్నలిస్టు సమాజ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టులకు కనీస గృహ భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేధావులు, సీనియర్ జర్నలిస్టులు, ఉద్యమకారులు, విద్యార్థులు, ప్రజాసంఘాల సహకారంతో కొత్త ఉద్యమాన్ని నిర్మించేందుకు చక్రవర్తి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



# స్వదేశానికి వెళ్లిన సన్‌రైజర్స్ ఆటగాడు ప్యాట్ కమిన్స్

పాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో సతమతమవుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన గతేడాది యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే తాను మొదటి సగం మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని కమిన్స్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో బరిలోకి దిగేందుకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు నుంచి అనుమతి లభించలేదు. దీంతో తుది స్కాన్, ఫిట్‌నెస్ క్లియరెన్స్ కోసం ఆయన స్వదేశానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో హైదరాబాద్ జట్టుకు భారీ షాక్ తగలనుంది. కమిన్స్ గైర్హాజరీలో విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో హైదరాబాద్ ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఫామ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న హైదరాబాద్, తన తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషనే జట్టును నడిపించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ఆస్ట్రేలియాలో జరిగే వైద్య పరీక్షల్లో కమిన్స్ ఫిట్‌గా ఉన్నట్లు తేలితేనే ఆయన తిరిగి భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ 17 నాటికి ఆయన మళ్ళీ జట్టుతో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ స్కాన్ నివేదికలు ప్రతికూలంగా వస్తే, ఈ సీజన్ మొత్తానికి ఆయన దూరం కావచ్చు. కమిన్స్ లేని పక్షంలో జట్టులో విదేశీ ఆటగాళ్లుగా ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ మలింగ వంటి వారు కీలకం కానున్నాడు. పాట్ కమిన్స్ కేవలం అద్భుతమైన బౌలర్ మాత్రమే కాదు, చతురత కలిగిన నాయకుడు కూడా. గత సీజన్‌లో జట్టును ముందుండి నడిపించిన ఆయన అనుభవం ఇప్పుడు సన్‌రైజర్స్‌కు ఎంతో అవసరం. అయితే ఇషాన్ కిషన్ నాయకత్వంలో యువ ఆటగాళ్లు రాణిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. రేపు రాజీవ్ గాంధీ స్టేడియంలో లక్నోతో జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ విజయం సాధించి పాయింట్ల పట్టికలో ముందుకు వెళ్లాలని పట్టుదలగా ఉంది.

# ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గుజరాత్‌కు చుక్కెదురు.. రాజస్థాన్‌కు రెండో విజయం..!



ఐపీఎల్‌లో ఏకపక్ష మ్యాచ్‌లతో విసిగిపోయిన అభిమానులను ఉత్కంఠ పోరు అలరించింది. భారీ స్కోర్ల పోరులో ఆఖరి ఓవర్ వరకూ ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌నే విజయం వరించింది. 211 పరుగుల ఛేదనలో సాయి సుదర్శన్(73) మెరుపులతో గెలుపు దిశగా సాగిన గుజరాత్ టైటాన్స్‌ను లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్(4-41)దెబ్బతీశాడు. చివరి ఓవర్లో ఆ జట్టు గెలవాలంటే 10 చేయల్సి రాగా.. తుషార్ దేశ్‌పాండే అద్భుతంగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను గెలిపించాడు. యార్కర్లతో గుజరాత్ బ్యాటర్లను నిలువరించిన ఈ కుర్రాడు 4 పరుగులే ఇవ్వడంతో రియాన్ పరాగ్ సేన వరుసగా రెండో విక్టరీ కొట్టింది.ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ రెండో విజయంతో మురిసింది. భారీ స్కోర్‌తో గుజరాత్ టైటాన్స్‌కు సవాల్ విసిరిన రాజస్థాన్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్‌ను కాపాడుకుంది. భారీ ఛేదనను దూకుడుగా ఆరంభించిన గుజరాత్ టైటాన్స్.. ఊహించని విధంగా తడబడింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(73), కుష్రగ(18)లు తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి గెలుపు దిశగా నడిపారు. కానీ, కుష్రగను ఔట్ చేసి బ్రేకివ్వగా.. అర్ధ శతకంత తర్వాత సుదర్శన్ వెనుదిరిగాడు.

# నువ్వే చెప్పు నేను ఓవర్సీస్ ప్లేయర్‌నా...

**• నాగ్స్‌ను రివర్స్‌లో ప్రశ్నించిన విరాట్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఏ జట్టైనా అత్యధికంగా నలుగురు ఓవర్సీస్ (ఫారిన్) ప్లేయర్లతోనే బరిలోకి దిగాలి. అంతకంటే ఒక్క ప్లేయర్‌ను కూడా మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతించరు. ఐపీఎల్‌లో ఫారిన్ ప్లేయర్ల విషయంలో ఉన్న నిబంధన ఇది. ఈ రూల్ తొలి సీజన్ నుంచే కొనసాగుతూ వస్తోంది. అయితే ప్రస్తుత సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మాత్రం ఐదుగురు ఓవర్సీస్ ప్లేయర్లతో ఆడుతోందని సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీనిపై బెంగళూరు కమెడియన్ మిస్టర్ నాగ్స్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని వివరణ అడిగాడు. కొంతకాలంగా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టీమ్‌ఇండియాకు మ్యాచ్‌లు లేని సమయంలో లండన్‌కు వెళ్లిపోతున్నాడు. అతడు కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. భార్య అనుష్క శర్మ, పిల్లలతో కలిసి విరాట్ లండన్ వీధుల్లో చక్కర్లు కొడుతున్న వీడియోలు సైతం అప్పుడప్పుడు సోషల్ మీడియాలో వస్తుంటాయి. దీంతో విరాట్ ఎక్కువగా సమయం లండన్‌లోనే గడుపుతుండడంతో అతడు ఓవర్సీస్ ప్లేయర్ అయిపోయాడంటూ ఫ్యాన్స్ ఫన్నీగా మీమ్స్ చేస్తున్నారు. అందుకే ఆర్సీబీ ఐదుగురు ఓవర్సీస్ ప్లేయర్లతో బరిలోకి దిగుతుందంటూ సెటైర్లు పేలుస్తున్నారు. దీని గురించే ఆర్సీబీ ఇన్‌సైడర్ షో లో విరాట్‌ను నాగ్స్ అడిగాడు. 'ఆర్సీబీ టీమ్ ఐదుగురు ప్లేయర్లతో ఆడుతుందని నెటిజన్లు అంటున్నారు. వాళ్లు అలా ఎందుకు అంటున్నారో నాకు అర్థం కావడం లేదు. వాళ్లు ఏం చెప్పాలనుకుంటున్నారు' అని నాగ్స్ అడగ్గా, విరాట్ ఒక్కసారిగా నవ్వేశాడు. 'నాకు కూడా తెలియదు. అయినా ఈ ప్రశ్న నన్ను ఎందుకు అడుతున్నావ్ అది ఫారిన్ ప్లేయర్లను అడుగు. నేను ఫారిన్ ప్లేయర్ కాదు. నువ్వే చెప్పు నేను ఓవర్సీస్ ప్లేయర్‌నా' అని రివర్స్‌లో నాగ్స్‌ను విరాట్ అడిగాడు. దీనికి 'కచ్చితంగా కాదు' అని అతడు రిప్లై ఇచ్చాడు. ఈ వీడియోను ఆర్సీబీ తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీనికి ఫన్నీ కామెంట్లు వస్తున్నాయి. ఫ్యామిలీతో లండన్‌లోనే ఉంటున్న కారణంగా ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ మ్యాచ్‌ల మధ్య ఎక్కువగా గ్యాప్ వస్తే తనను అక్కడికే పంపించాలని ఫ్రాంచైజీని విరాట్ కోరినట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకోసం స్పెషల్ ఫ్లైట్ ఏర్పాటు చేయాలని విరాట్ అడిగితే, ఫ్రాంచైజీ కూడా ఓకే చెప్పిందని వార్తలు వచ్చాయి. అయితే అవన్నీ ఫేక్ అని విరాట్ కొట్టిపారేశాడు. అలాంటిదేమీ లేదని అన్నాడు. మిస్టర్ నాగ్ బెంగళురుకు చెందిన ఒక కమెడియన్. అతని అసలు పేరు డానిష్ సెయిట్ అలియాస్ డానీ. ఎదుటివారిని నొప్పించకుండా నవ్వించడం నాగ్స్ స్పెషాలిటీ. అతడు కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో అర్సీబీకో ట్రావెల్ చేస్తున్నాడు. ప్రతీ సీజన్‌లో ఆర్సీబీ ప్లేయర్లతో ముఖ్యంగా విరాట్ కోహ్లీతో ఇలాంటి ఫన్నీ చిట్ చాట్ నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఏర్పడింది.

# సమీర్ రిజ్వీ విధ్వంసం.. ముంబైని చిత్తుగా ఓడించిన ఢిల్లీ..!



పంతొమ్మిదో సీజన్‌లో ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(90) జోరుతో ఢిల్లీ క్యాపిటల్స్ వరసగా రెండో విజయంతో మురిసింది. సొంత మైదానంలో రిజ్వీ దూకుడు ముందు ముంబై ఇండియన్స్ బౌలర్లు తేలిపోగా.. 163 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ ఉఫ్‌మనిపించింది. ఆరంభంలోనే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని రిజ్వీ ఓపెనర్ పథుమ్ నిశాంక(44)తో కలిసి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఈ హిట్టర్‌కు డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) మెరుపులు తోడవ్వగా.. 18.1 ఓవరల్లోనే మ్యాచ్‌ను ముగించింది ఢిల్లీ. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఛేజింగ్ జట్లు విజయదుంధుబి మోగిస్తున్నాయి. తమ సొంత ఇలాకాఆరుణ్ జైట్లీ స్టేడియంలో పంజా విసిరిన ఢిల్లీ క్యాపిటల్స్ పటిష్టమైన ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత ప్రత్యర్థిని 163కే కట్టడి చేసింది ఢిల్లీ.



# సంజు శాంసన్‌కు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మద్దతు



ఐపీఎల్ 2026 సీజన్లో సీఎస్కే తరపున ఆడుతున్న సంజు శాంసన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాలతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చిన సంజు శాంసన్.. ఇప్పటివరకు ఆడిన రెండు ఇన్నింగ్స్‌లలో కేవలం 6, 7 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన ప్లేయర్ ఇలా వరుసగా విఫలమవ్వడంతో అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అయితే జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాత్రం తమ ఆటగాడికి పూర్తి మద్దతుగా నిలిచారు. మీడియా సమావేశంలో సంజు శాంసన్ ఫామ్ గురించి అడిగిన ప్రశ్నపై స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందిస్తూ.. విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. " టీ20 క్రికెట్లో ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు సాధించడం సాధ్యం కాదు. సంజు శాంసన్ ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. నెట్స్‌లో సంజు అద్భుతంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కేవలం రెండు ఇన్నింగ్స్‌ల ఆధారంగా సంజు శాంసన్ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. ఒక్కసారి అతను ఫామ్ అందుకుంటే మ్యాచ్ విన్నర్‌గా నిలుస్తాడు. కాబట్టి సంజు శాంసన్ ఫామ్ గురించి మాకు ఎలాంటి ఆందోళన లేదు" అని స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పష్టం చేశాడు. గణాంకాలను పరిశీలిస్తే.. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో సంజు శాంసన్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఈ స్టేడియంలో ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో సంజు శాంసన్ కేవలం 66 పరుగులు మాత్రమే చేశాడు. ఇక్కడ సంజు శాంసన్ సగటు 11 కాగా.. స్ట్రైక్ రేట్ 100గా ఉంది. ఐపీఎల్‌లో కనీసం 5 ఇన్నింగ్స్‌లు ఆడిన స్టేడియాల్లో సంజు శాంసన్‌కు ఇదే అత్యల్ప సగటు కావడం గమనార్హం. అయినప్పటికీ.. సీజన్లో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయని.. సంజు శాంసన్ ఖచ్చితంగా పుంజుకుంటాడని సీఎస్కే యాజమాన్యం ధీమా వ్యక్తం చేస్తోంది. గత సీజన్లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్.. ఈ సీజన్లో కూడా ఆరంభంలోనే వరుసగా రెండు ఓటములను చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన సీఎస్కే.. ఇప్పుడు తన తదుపరి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో తలపడనుంది. ఆదివారం జరగబోయే ఈ కీలక పోరులోనైనా సంజు శాంసన్ ఫామ్‌లోకి వచ్చి జట్టుకు తొలి విజయాన్ని అందిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆర్చర్‌కు చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ

ఐపీఎల్ 2026 సీజన్లో ప్రస్తుతం క్రికెట్ అభిమానులందరి నోటో వినిపిస్తున్న ఒకే ఒక్క పేరు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులోనే దిగ్గజ బౌలర్లను తన బ్యాటింగ్ పవర్‌తో భయపెడుతున్న ఈ రాజస్థాన్ రాయల్స్ 'వండర్ బాయ్' నేడు గుజరాత్ టైటాన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు నెట్స్‌లో బీభత్సం సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ శైలి చూస్తుంటే.. అప్పుడే అంతర్జాతీయ స్థాయి అనుభవం ఉన్న ఆటగాడిలా కనిపిస్తున్నాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ 46 సెకన్ల వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇందులో ఇంగ్లాండ్ స్టార్ పేసర్ ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన బౌలర్లలో ఒకరైన జోఫ్రా ఆర్చర్ వేస్తున్న నిప్పులు చెరిగే బంతులను వైభవ్ ఏమాత్రం తడబడకుండా ఎదుర్కోవడం విశేషం. సాధారణంగా జోఫ్రా ఆర్చర్ వేగానికి దిగ్గజ బ్యాటర్లే డిఫెన్స్‌లో పడతారు. కానీ వైభవ్ సూర్యవంశీ మాత్రం క్రీజులో నిలబడి భారీ సిక్సర్లు, క్లాసీ ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఈ వీడియో చూసిన అభిమానులు.. జోఫ్రా ఆర్చర్‌నే వదలని ఈ



కుర్రాడిని ఆపడం ఎవరి తరమని చర్చించుకుంటున్నారు. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనే సీఎస్కే బౌలర్లపై వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో 305.88 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో కేవలం 17 బంతుల్లో 52 పరుగులు సాధించి రాజస్థాన్ రాయల్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 5 కళ్లు చెదిరే సిక్సర్లు ఉండటం గమనార్హం.వైభవ్ సూర్యవంశీ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన కేవలం 8 మ్యాచ్‌ల్లోనే వైభవ్ 304 పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. వైభవ్ సూర్యవంశీ స్ట్రైక్ రేట్ 218.70గా ఉందంటేనే అతని దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ చరిత్రలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించడమే కాకుండా.. కేవలం 35 బంతుల్లోనే గుజరాత్ టైటాన్స్‌పై గతంలో సెంచరీ బాది, లీగ్ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాట్‌తో మ్యాజిక్ చేస్తాడేమో చూడాలి.

# ఐపీఎల్‌లో పోటీ అత్యంత కఠినంగా ఉంటుంది

**• ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేళ జయవర్ధనే**

ఐపీఎల్‌లో తమ జట్టు ఐదు టైటిల్స్ గెలిచిందని, కొన్ని జట్లు ఇంకా ఒక్క ట్రోఫీ కూడా అందుకోలేదని ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేళ జయవర్ధనే అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశాడు. గత ఐదేళ్లుగా ముంబై టైటిల్ గెలవలేదు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. కొన్ని జట్లు ఒక్క టైటిల్ కూడా గెలవలేదని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ తర్వాతి ఐదు సీజన్లలో ఫైనల్ చేరలేకపోయింది. ఈ సీజన్‌ను ఘనంగా ప్రారంభించి 14 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన ముంబై ఇండియన్స్.. అదే జోరు కనబర్చాలనే లక్ష్యంతో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో జయవర్ధనే మాట్లాడాడు. ఐపీఎల్‌లో పోటీ అత్యంత కఠినంగా ఉంటుందని చెప్పాడు.'పది జట్లతో కూడిన ఐపీఎల్‌లో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. గత ఐదేళ్లలో మేం టైటిల్ గెలవలేకపోయాం. కానీ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచాం. కాబట్టి మేం సరిగ్గా ఆడలేదనే ప్రశ్నే అనవసరం. గత కొన్నేళ్లుగా తమ జట్టు నిలకడగా రాణిస్తోంది. మా ప్రాసెస్‌పై మాకు నమ్మకం ఉంది. ఇక ముందూ భిన్నంగా చేయాల్సిన అవసరం లేదు. ఐదేళ్ల నుంచి మేం టైటిల్ గెలవలేదు. కానీ ఇప్పటికీ ఒక్క టైటిలూ నెగ్గని జట్లూ ఉన్నాయి. కాబట్టి, దాని గురించి మేం ఆందోళన చెందడం లేదు.'అని మహేల జయవర్ధనే స్పష్టం చేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(36 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. రోహిత్ శర్మ(26 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 35) విలువైన పరుగులు చేశాడు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. లుంగి ఎంగిడి, అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్, నటరాజన్ తలో వికెట్ తీసారు. అనారోగ్యంతో ఈ మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం కాగా.. సూర్యకుమార్ యాదవ్ తాత్కలిక సారథిగా జట్టును నడిపిస్తున్నాడు.

# 10న విడుదలవుతున్న డెకాయిట్

## ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం




అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళ పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

-------------

# రాముడు, పరశురాముడు.. రెండూ రణ్‌బీర్ కపూరే

**ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్**

ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశురాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది. రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించేందుకే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని రణ్‌బీర్ తెలిపాడు.



------------

# అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక. ఇండియా స్వీట్ హార్ట్ గా రష్మిక.. పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న “ క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026“లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఆది సాయికుమార్ కొత్త చిత్రం... 'సైరాభాను'




యంగ్ హీరో ఆది సాయికుమార్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి “సైరాబాను‘ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది.

ఇటీవలే 'కె-ర్యాంప్' చిత్రంతో సంచలన విజయం అందుకున్న ప్రముఖ నిర్మాత రాజేష్ దండా తన హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆది సాయికుమార్ సరసన బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. గులాబీ రంగు మేఘం, దాని కింద 'ప్రేమ, విశ్వాసం, విధికి సంబంధించిన ఒక సరదా ప్రయాణం' అనే ట్యాగ్‌లైన్‌తో రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఇది ఒక హిందూ-ముస్లిం ప్రేమకథ అని, వినోదభరితంగా సాగుతుందని తెలుస్తోంది. రాజమండ్రి, హైదరాబాద్ నగరాల నేపథ్యంలో కథ నడుస్తుంది. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిరణ్ అబ్బవరం, రామ్ అబ్బరాజు, కోన వెంకట్ తదితరులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'శంబాల'తో కెరీర్‌లో మంచి హిట్ అందుకున్న ఆది సాయికుమార్, ప్రస్తుతం కథాబలం ఉన్న కమర్షియల్ చిత్రాలను ఎంచుకుంటున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



# డైరెక్టర్లకు రైటర్లకు పని పెట్టిన యాంగ్రీ యంగ్ మెన్!

: ఓడలు బల్లవుతాయి..బల్లు ఓడలవుతాయి అంటారు పెద్దలు. ఇది జీవితంలో సహజం. ఎప్పుడు ఎవరి స్థార్ తిరుగుతుందో..ఎవరి స్థానం ప్రధాన స్థాయికి చేరుకుంటుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. కాలాన్ని బట్టి మార్పులు వస్తుంటాయి. వాటిని అంతే హుందాతో స్వీకరించిన వారు విజయవంతంగా కెరీర్‌లో దూసుకుపోతూ ముందుకు సాగుతుంటారు. ఆ మార్పులు స్వీకరించని వారు అక్కడే ఉండిపోతారు. కాల క్రమేణా తెరమరుగవుతుంటారు. ఇదే విషయాన్ని బాగా ఒంటబట్టించుకున్నట్టున్నాడు యాంగ్రీ యంగ్ మెన్‌గా పేరు తెచ్చుకున్న డా. రాజశేఖర్.యాంగ్రీ యంగ్‌మెన్ డాక్టర్ రాజశేఖర్..ఒక దశలో పవర్ ఫుల్ కాప్ స్టోరీస్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో. అంకుశం, ఆహుతి, ఆవేశం వంటి పవర్‌ఫుల్ స్టోరీస్‌తో ప్రేక్షకుల్లో పోలీస్ అంటే ఇలా ఉండాలని ఓ ట్రేడ్ మార్క్‌ని సెట చేసి హీరోగా ప్రత్యేకతను చాటుకున్న డా. రాజశేఖర్ ఆ తరువాత ఆ స్థాయిలో ఆకట్టుకోవడంతో తడబడ్డారు. ఏజ్ ఫ్యాక్టర్, మారిన పరిస్థితులు, ప్రేక్షకుల అభిరుచి కారణంగా ఆయన హీరోగా రేసులో వెనకబడ్డారు. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా గ్రహించిన ఆయన కొత్త తరహా పాత్రలతో సెండ్ ఇన్నింగ్స్‌ని స్టార్ట్ చేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు.

కానీ ఏదీ వర్కవుట్ కాలేదు. ఒకటి రెండు సినిమాలు అంగీకరించినా వారు రాజశేఖర్ వంటిప్రొటెన్షియల్ ఉన్న స్టార్‌ని ఉపయోగించుకోవడంతో, ఆయన క్యారెక్టర్‌ని పవర్ ఫుల్‌గా డిజైన్ చేయడంలో ఫెయిలయ్యారు. దాంతో రాజశేఖర్ సెకండ్ ఇన్నింగ్స్ ప్రశ్నార్థకంలో పడింది. కోవిడ్ కారణంగా ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొని చావు దాకా వెళ్లొచ్చిన ఆయనకు ఇప్పటికి సరైన సినిమా దొరికింది అదే -బైకర్-. శర్వానంద్ హీరోగా నటించిన బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో డా. రాజశేఖర్ ఆయన ఇమేజ్‌కి తగ్గ క్యారెక్టర్‌లో నటించి మెప్పించారు.